క్లుప్తంగా

క్రీడలతో మానసిక వికాసం



ఫిరంగిపురం: క్రీడలు మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయని హెచ్‌ఎం లింగిశెట్టి సాంబయ్య అన్నారు. మండలంలోని వేములూరిపాడు జెడ్పీ హైస్కూల్లో మంగళవారం రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో విద్యాశాఖ ఆధ్వర్యాన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో భాగంగా ఈనెల 15న చిలుకలూరిపేట ఎంఎంజీలో ఆటల పోటీలు నిర్వహించారన్నారు. ఈపోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఆసిఫా, సాయివర్ధన్‌లు జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ సుజాత, ఉపాధ్యాయులు రాజులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వస్థ నారీ స్వశక్తి పరివార్


తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా బుధవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తాడేపల్లి పీహెచ్‌సీ వైద్యులు శాంత కుమారి తెలిపారు. మంగళవారం తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావుతో కలసి వైద్యులు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ మందిరాలు, పీహెచ్‌సీలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు తాడేపల్లిలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ డ్రైవర్స్ కాలనీలో, కుంచనపల్లి యూపీహెచ్‌సీలో కార్యక్రమం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మహిళలు, బాలింతలు, చిన్నపిల్లలు, గర్భిణులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు మానసమంజరి, మెడికల్ ఆఫీసర్లు సంద్ర నాగేంద్రబాబు, హర్షవర్ధన్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



తాడేపల్లి రూరల్: గొల్లపూడిలో ఈ నెల 25న జరగనున్న అంతర్‌జిల్లా కబడ్డీ పోటీలకు తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రాతూరులో ఉన్న గుడ్‌న్యూస్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కరస్పాండెంట్ రెవ. ఫాదర్ మాట్లాడుతూ స్కూల్‌కు చెందిన ఎస్. సింధు, కె.ఏడుకొండలు అంతర్‌జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ ఆరోగ్యదాస్, అడ్మినిస్ట్రేటర్ రెవ. ఫాదర్ సుగంధన్, క్యాంప్ ఇన్‌చార్జి రెవ. ఫాదర్ సెబాస్టియన్, ఫిజికల్ డైరెక్టర్స్ అజయ్‌కుమార్, డి. సురేష్ తదితరులు అభినందించారు.

మంగళగిరిలో మోడల్ లైబ్రరీ



తాడేపల్లి రూరల్: మంగళగిరిలో మోడల్ లైబ్రరీ త్వరలో ప్రారంభంకానుంది. దీని కోసం మంత్రి లోకేష్ రూ.1.30 కోట్ల నిధులను కేటాయించారు. మంగళగిరి శివాలయం పక్కన గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రథమ శ్రేణి గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. మొదటి అంతస్తులో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే ఉద్యోగార్థులకు రెండు క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో కాంపిటేటివ్, సాఫ్ట్ స్కిల్ వంటి తరగతులు నిర్వహిస్తారు. డిజిటల్ లైబ్రరీ, 20 కంప్యూటర్లను ఏర్పాటు చేయనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పిల్లలకు ఉపయోగపడే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. దినపత్రికలు, వార, మాస పత్రికలు అందుబాటులో ఉండటానికి రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయనున్నారు.

అంగన్‌వాడీ టీచర్ మృతి

దుగ్గిరాల: తుమ్మపూడి గ్రామానికి చెందిన మోర్ల రాజ్యలక్ష్మి (55) దుగ్గిరాల మండలం తుమ్మపూడి–2 అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు. రెండు రోజుల నుంచి అనారోగ్యంతో తెనాలిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఆమెకు తీవ్ర గుండెపోటు రావడంతో మృతి చెందారు.

సమస్యల తిష్ట

కాలనీలోని అంతర్గత రోడ్లలో వర్షం నీరు

- ఆత్మకూరు జగనన్న కాలనీలో ప్రజలకు ఇక్కట్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- బురదమయంగా రోడ్లు
- డ్రైనేజీ లేదు.. కొరవడిన పారిశుద్ధ్యం
- కార్పొరేషన్ అధికారుల్లో స్పందన ఏదీ



బురదమయంగా మారిన కాలనీలోకి వెళ్లే ప్రధాన రోడ్డు

మంగళగిరి: పేదల కాలనీల్లో సమస్యలు తిష్ట వేసినా కూటమి ప్రభుత్వం స్పందించడం లేదు. ప్రజలు వసతులు ఏర్పాటుచేయాలని కోరుతున్నా వారిలో చలనం రావడం లేదు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(ఎంటీఎంసీ) పరిధిలోని ఆత్మకూరు వైఎస్సార్ జగనన్న కాలనీలో సమస్యలతో సతమతమవుతున్నారు. కాలనీలో 292 ఇళ్లు ఉన్నాయి. వెయ్యి మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు.

వసతులు విస్మరించిన కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కాలనీలో వసతుల ఏర్పాటును పట్టించుకోవడం లేదు. చినుకుపడితే కాలనీలోకి వెళ్లే గ్రావెల్ రోడ్లు బురదమయంగా మారాయి. గోతులు పడి అధ్వానంగా కనిపిస్తున్నాయి. ప్రధాన రోడ్ల నుంచి నుంచి కాలనీలోకి వెళ్లాలన్నా బయటకు రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు అవస్థ పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాడుక నీరు రోడ్లపై నిలిచిపోతోంది. చిన్నపాటి జల్లు పడినా కాలనీలోకి వెళ్లే రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలో నీరు నిలుస్తున్నాయి. చెరువులుగా మారి బురదమయంగా మారుతుండటంతో పాటు ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రాలేక పోతున్నారు.



కాలనీ అంతర్గత రోడ్డు ఇలా

జారిపడటమే..

కాలనీలోని వారంతా కూలికి వెళ్లి రోజు గడుపుకొనే పేదవారే. పనులకు వెళ్లిన వారు చీకటి పడితే కాలనీలోకి రావాలంటే రోడ్డుపై జారి బురదలో పడి గాయలపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లలేకపోతుండగా, వృద్ధులు ఇంటి నుంచి బయటకు రాలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దోమలు ప్రబలడంతో స్థానికులు వైరల్ ఫీవర్స్, మలేరియా, డెంగీ జ్వరాలపడిన పడుతున్నారు. వెంటనే కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయడంతో కాలనీలో పారిశుద్ధ్యం, తాగునీరు సక్రమంగా సరఫరా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్థికాభివృద్ధిలో ఎంఎస్‌ఎంఈల కీలకపాత్ర

మంగళగిరిటౌన్: దేశ సామాజిక ఆర్థికాభివృద్ధిలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ) కీలక పాత్ర పోషిస్తున్నాయని ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ కె. నాగేంద్ర బాబు అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి కార్యాలయంలో మంగళవారం ఎంఎస్‌ఎంఈల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను సృష్టించడంతో పాటు, దేశంలోని మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి దోహదపడతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈల అభివృద్ధే లక్ష్యంగా ర్యాంప్ స్కీమ్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ ఉండవల్లి శాఖ బ్యాంక్ మేనేజర్ మాధవి, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు చెందిన వారు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

దుగ్గిరాల: శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభమైంది. మంగళవారం దుగ్గిరాల గ్రామ పంచాయతీ సచివాలయం–2లో ఆధార్ సేవలు ఇక నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటాయని దుగ్గిరాల కార్యదర్శి వివేకానంద తెలిపారు. మండల ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆర్‌వీఆర్‌జేసీలో సోలార్‌పవర్‌పై వర్క్‌షాప్



సోలార్ పవర్ ప్యానల్స్ గురించి వివరిస్తున్న అతిథులు, కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: భవిష్యత్తు ప్రధాన శక్తి వనరుగా సౌరశక్తి ప్రపంచ వ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతుందని, విద్యార్థులు ఈ రంగంలో మరిన్ని పరిశోధనలు చేసి నూతన ఆవిష్కరణలు చేయాలని హెచ్‌ఐఈఈ ఎంపవరింగ్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మదన్ మోహన్‌గౌడ్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సోలార్ పీవీ యూనిట్ డిజైన్, ఇన్‌స్టలేషన్ అండ్ మెయింటెనెన్స్‌పై నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు సౌరశక్తి వినియోగ ప్రాధాన్యం, సోలార్ ప్యానెల్ డిజైన్, ఇన్‌స్టలేషన్ పద్ధతులు, నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్క్ (రాజస్థాన్) భారత్‌లో ఉండటం గర్వకారణమని, సౌరశక్తి వినియోగాన్ని పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలతో అనేక ప్రాజెక్టులు అమలు చేస్తున్నాయన్నారు. సౌరశక్తి వినియోగంతో పర్యావరణ పరిరక్షణకే కాకుండా విద్యార్థులకు అనేక అవకాశాలు కల్పిస్తుందని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. ఇటువంటి వర్క్‌షాప్‌లు విద్యార్థుల ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, ఎంపవరింగ్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ టెక్నికల్ మేనేజర్ జహీర్‌ఖాన్, డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ ఎన్‌సీ కోటయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల స్వచ్ఛత కోసమే సీఆర్పీలకు శిక్షణ

ప్రత్తిపాడు: గ్రామాలను స్వచ్ఛ బాటలో నడిపించడమే సీఆర్పీల లక్ష్యమని గుంటూరు డివిజన్ డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం పంచాయతీలోని సుప్రీమ్ ఎల్‌టీసీలో రెండవ రోజు పెద నందిపాడు, వట్టిచెరుకూరు, పెదకాకాని, తుళ్ళూరు, మేడికొండూరు మండలాల సీఆర్పీలకు వ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గ్రామ సర్పంచ్ చల్లా నాగమల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతలో సీఆర్పీలది కీలకపాత్ర అని తెలిపారు. గ్రామం మనకు ఏమి ఇచ్చిందని కాకుండా, గ్రామానికి మనం ఏమి చేశామో.. ప్రతి ఒక్కరికీ తెలియజేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా, ఐటీసీ, ఫినిష్ సొసైటీ కో ఆర్డినేటర్ ఉమామహేశ్వరి, సీఆర్పీలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు తీర్చండి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలను తీర్చడానికి ప్రభుత్వం ముందుకు రావాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ నేత ఆదినారాయణ కోరారు. మంగళవారం ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న నిరాహార దీక్షా శిబిరాన్ని నాయకులు సుభాని, వై.సాంబశివ రావుతో కలసి సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కోర్టు తీర్పుల ప్రకారం న్యాయంగా రావాల్సిన బకాయిల కోసమే కార్మికులు దీక్షలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నేతలు వై.రమాదేవి, శారమ్మ, సువర్ణకుమారి, రిబ్కా, కాసమ్మ, శివకుమారి, ఇమాంబి, దుర్గాభవాని, నాగమల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు కృత్రిమ ఉపకరణాల పంపిణీ

ప్రత్తిపాడు: గుంటూరు రూరల్, కాకుమాను, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల్లోని వికలాంగులు, సీనియర్ సిటిజన్లకు నేడు కృత్రిమ ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ప్రత్తిపాడు ఎంపీడీవో కె.శివపార్వతి తెలిపారు. అసెస్మెంట్ క్యాంపులో అర్హులను గుర్తించి, బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా కృత్రిమ ఉపకరణాలను అందిస్తామని చెప్పారు.

పారిశుద్ధ్య కార్మికులకు 'సంక్షేమాన్ని' అమలుచేయాలి

సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న పల్లె కృష్ణ

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను పారిశుద్ధ్య కార్మికులకు కూడా అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ కోరారు. మంగళవారం తాడేపల్లిరూరల్ పరిధిలోని కొలనుకొండలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్మికుల రిటైర్‌మెంట్ వయస్సును 65 ఏళ్లకు పెంచాలని కోరుతున్నామన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు, గ్లౌజులు, చెప్పులు వెంటనే మున్సిపల్ అధికారులు కార్మికులకు అందజేయాలని కోరారు. కార్మికుల ఇక్కట్లపై పాలకులు స్పందించి తీర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం కొలనుకొండ పారిశుద్ధ్య కార్మికులతో కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడిగా పాపయ్య, ఉపాధ్యక్షులుగా బేబి, కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా అంగమ్మ, కోశాధికారిగా కె.రాజును ఎన్నుకున్నారు.

సత్వర న్యాయానికి న్యాయవాదుల పాత్ర కీలకం



న్యాయవాదులను సత్కరిస్తున్న కంచర్ల కాశయ్య

మంగళగిరిటౌన్: ప్రజలకు సత్వర న్యాయసేవలు అందించడంలో న్యాయవాదులు కీలకపాత్ర వహిస్తున్నారని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య అన్నారు. మంగళగిరి నగరపరిధిలోని న్యాయవాదుల దినోత్సవం పురస్కరించుకుని పలువురు న్యాయవాదులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాశయ్య మాట్లాడుతూ పేదలు, వెనుకబడిన వర్గాలకు చట్టపరమైన రక్షణ కల్పించడంలో అందిస్తున్న సేవలు అపూర్వమైనవని కొనియాడారు. ఈ సేవలు భవిష్యత్తులో కొనసాగాలని, న్యాయవాదులు ప్రజాహక్కుల పరిరక్షణలో అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లంకా శివరామ ప్రసాద్, సీనియర్ న్యాయవాది వాకా రామ్‌గోపాల్‌గౌడ్‌లను సన్మానించారు.

కుక్కా కరవకే..

- 'మంగళగిరి'లో శునకాల స్వైర విహారం
- ప్రజలు బెంబేలు



మంగళగిరి గౌతమ బుద్ధ రోడ్‌లో కుక్కల స్వైర విహారం

మంగళగిరి టౌన్: కర్ర పట్టుకుంటే గానీ నియోజకవర్గంలో బయటకు వచ్చే పరిస్థితి కానరావడం లేదు. ఎందుకంటే ఎటు చూసినా వీధి కుక్కల గుంపులే. వీధుల్లోకి రావాలంటే పాదచారులు, వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. పిన్న, పెద్ద వీటిని చూసి హడలిపోతున్నారు. ఇక కొత్తవారు వస్తే పరుగులు తీయాల్సిందే. రాత్రి వేళల్లో అయితే బయటకు రావాలంటే ప్రజలు వణికిపోతున్నారు. పట్టణం, పల్లె ప్రాంతాల్లో అన్ని ప్రధాన రోడ్లలో కుక్కల గుంపులు కనిపిస్తున్నాయి.

కుక్కల దాడులు

వారంరోజుల క్రితం ఒకే రోజు ఒకే ప్రాంతంలో ఐదుగురిపై కుక్కలు దాడిచేశాయి. పాత మంగళగిరిలోని లూథరన్ చర్చివద్ద ద్విచక్రవాహనంపై వెళుతున్న వారిపై కుక్కలు వెంటపడ్డాయి. బైక్‌పై వెనుక ఉన్న వ్యక్తిపై కుక్క దాడి చేయడంతో స్వల్పగాయాలు అయ్యాయి. ప్రతి రోజూ పదుల సంఖ్యలో ఆసుపత్రులకు కుక్కకాటుకు గురైన వారు వస్తున్నారని పలువురు వైద్యులు వెల్లడిస్తున్నారు. మంగళగిరి నగరంలో ఏ వీధిలో పరిశీలించినా వీధి కుక్కలు పదుల సంఖ్యలో ఉంటున్నాయి.

గుంపులు గుంపులుగా

మండలంలోని ప్రతి గ్రామంలో రోడ్లపై పెద్ద సంఖ్యలో శునకాలు దర్శనమిస్తున్నాయి. ఆయా మండలాల్లో అధికారులు పాలకుల అనుమతి తీసుకుని వాటిని పట్టించి ఊరికి దూరంగా వదిలిపెట్టాల్సి ఉంటుంది. అయితే అనుమతుల విషయంలో కొన్ని ప్రాంతాల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు పాలకులు పట్టించుకోకపోవడంతో వీటి సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. మంగళగిరి నగర పరిధిలో పాత మంగళగిరి, టిడ్కో గృహ సముదాయాలు, సీతారామ కోవెల సెంటర్, గౌతమబుద్ధ రోడ్డు తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. రాత్రి సమయంలో అయితే వీటి సంచారం ఇంకా ఎక్కువగా ఉంటుంది. చాలామంది ఉదయాన్నే కాలనీ రోడ్లపై నడక సాగిస్తుండగా వారిపై దాడులకు తెగబడుతున్నాయి. నైట్ డ్యూటీచేసే వారికి, సెకండ్‌షో సినిమాకు వెళ్లివచ్చే వారికి వీటి సమస్య ఎక్కువే.



మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ రోడ్‌లో దోలాస్ నగర్ వద్ద కుక్కల గుంపు

ఆస్పత్రులకు పరుగులు....

ఆయా మండలాల పరిధిలో ఆరోగ్య కేంద్రాలకు ప్రతినిత్యం కుక్కకాటు బాధితులు వస్తున్నారు. ఇటీవల ఒక్క రోజే పదిమందికి పైగా వచ్చి యాంటీ రేబిస్ ఇంజక్షన్లు చేయించుకున్నారు. అధిక సంఖ్యలో పిల్లల్నే శునకాలు కరుస్తున్నాయి. వీటిలో పిచ్చికుక్కలు ఉంటే మాత్రం ప్రమాదకరమని వైద్యులు అంటున్నారు. గుంపులుగా చేరిన కుక్కలు పిల్లలపై ఎగబడుతున్నాయి.

రెండు నెలల్లోనే సుమారు 800 మందికి పైగా కుక్కకాటుకు గురి

మంగళగిరి నియోజకవర్గ పరిధిలో మూడు మండలాల్లో కలిపి 9 యూపీహెచ్‌సీలు, 5 పీహెచ్‌సీలతో కలిపి మంగళగిరి నగరంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతిరోజూ కాటుకు గురైన వారు వస్తూనే ఉన్నారు. 2025 జూలై, ఆగస్టు, సెప్టెంబర్ 15వ తేదీ వరకు మూడు మండలాల్లో కలిపి సుమారుగా 800 మందికి పైగా కుక్కకాటుకు గురైనట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రభుత్వం ఆస్పత్రులతో పాటు.. ప్రైవేటు వైద్యశాలలకు కుక్కకాటుకు గురైన వారు వెళ్లే వారి సంఖ్య మరెంతో. కుక్కకాటుకు గురైన వారు కచ్చితంగా నాలుగు డోస్‌లు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కుక్కకాటుకు గురైన తర్వాత మొదటి రోజు 1వ డోస్, మూడవ రోజు 2వ డోస్, 7వ రోజు మూడవ డోస్, 28వ రోజు 4వ డోస్ యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు



కుక్కలు దాడిచేయడంతో గాయపడ్డ వృద్ధుడు

తాడికొండలో వీధి కుక్కల బెడద

తాడికొండ: ఇటీవల కాలంలో తాడికొండలో వీధి కుక్కల బెడద అధికమైంది. గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కల దాడులు అధికం కావడంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. కుక్కల ఏరివేతకు నిబంధనలు అడ్డుగా ఉన్నాయనే సాకుతో గ్రామ పంచాయతీలు చేతులెత్తేయడంతో పరిస్థితి రోజు రోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. తాడికొండలో కుక్కలతో పాటు గుంపులుగా సంచరిస్తున్న కోతుల బెడద కూడా ఎక్కువగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి కుక్కలు, కోతుల ఏరివేతకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



గుంపులుగా సంచరిస్తూ దాడులకు దిగుతున్న వీధి కుక్కలు

ఏఆర్‌వీ అందుబాటులో ఉంది



కుక్కకాటుకు గురైన వారు ప్రతిరోజూ ఆస్పత్రికి వస్తున్నారు. బాధితులకు ఏఆర్‌వీ అందుబాటులో ఉంది. కుక్క కరిచిన వెంటనే నీటితో శుభ్రం చేస్తే చాలావరకు ప్రమాదం తగ్గుతుంది. తర్వాత ఆస్పత్రికి వచ్చి నిర్దేశించిన తేదీల్లో క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించుకోవాల్సి ఉంటుంది. పిల్లలను రాత్రివేళ బయటకు తీసుకువెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– స్నేహరాజ్, ప్రభుత్వ వైద్యాధికారి

పరామర్శ



నివాళులర్పిస్తున్న వజ్రబాబు, నందిగం సురేష్

తాడికొండ: వైఎస్సార్ సీపీ ఆర్టీఐ వింగ్ తాడికొండ నియోజకవర్గ అధ్యక్షులు గద్దర్ చెన్నకేశవ కుమార్తె సోమవారం అనారోగ్య కారణాలతో మృతి చెందింది. కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్), మాజీ ఎంపీ నందిగం సురేష్ పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చి ఓదార్చారు. వారి వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువలు ఆక్రమిస్తే చర్యలు

పొన్నూరు: సైడ్ కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే తగిన చర్యలు తీసుకుని, ఆ నిర్మాణాలను పూర్తి స్థాయిలో తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ముబారక్ నగర్, 21వ వార్డులో నూతనంగా నిర్మించిన డ్రెయినేజీలపై అక్రమంగా నిర్మించిన పార్కింగ్ స్లాబ్‌లను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలు పునరావృతమైతే ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.